# నమస్తే తెలంగాణ
## మహబూబ్‌నగర్
### నారాయణపేట

3 | మహబూబ్‌నగర్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


## కంట్రోల్ రూం నంబర్లు..

**మహబూబ్‌నగర్ : 08542-241165**

**నారాయణపేట : 9154283914**

**జోగుళాంబ గద్వాల : 9100901605**

**వనపర్తి : 08545-233525, 08545-220351**

**నాగర్‌కర్నూల్ : 08540-230201**

మరికల్ : మద్వార్ రోడ్డు వద్ద ఇండ్ల మధ్యలో భారీగా ప్రవహిస్తున్న వర్షపునీరు, (ఇన్‌సెట్లో) అచ్చంపేట రూరల్ : ఉమామహేశ్వరం వద్ద కనువిందు చేస్తున్న జలపాతం





హన్వాడ : అలుగు పారుతున్న నాయినోనిపల్లి బెరోనికుంట, దేవరకద్ర : డోకూర్–దేవరకద్ర మార్గమధ్యంలో కోతకు గురైన రహదారి

## ఉమ్మడి జిల్లాకు రెడ్ అలర్ట్




# అతలాకుతలం

## ఇల్లు కూలి వ్యక్తి మృతి



చంద్రయ్య(ఫైల్)

పెబ్బేరు, ఆగస్టు 31 : ఎడతెరిపి లేని వర్షాలకు ఇల్లు కూలి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన వనపర్తి జిల్లాలో చోటుచేసుకున్నది. శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో శుక్రవారం రాత్రి వడ్డె చంద్రయ్య (65) తన ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి పై కప్పు కూలిపోయింది. చుట్టుపక్కల వారు వెంటనే సహాయ చర్యలు చేపట్టి ఆయనను వెలికితీయగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందగా ఒంటరిగా ఇంట్లో ఉంటున్నాడు. ఆయన ఇద్దరి కొడుకులు కూడా గ్రామంలోనే వేర్వేరుగా నివసిస్తున్నారు. ఘటన తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు గ్రామానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. శనివారం వనపర్తి ఏరియా దవాఖానలో ఉన్న చంద్రయ్య మృతదేహాన్ని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



తాటిపాములలో కూలిన చంద్రయ్య ఇల్లు

## డయల్ 100కూ చేయొచ్చు..

అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు డయల్ 100కు కూడా ఫోన్ చేయొచ్చని ఎస్పీలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కృష్ణానది ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. వాగులు, వంకలతోపాటు కాజ్‌వేల వద్ద పహారా కాశారు. రెవెన్యూ అధికారుల సమన్వయంతో రహదారులపై వాగులు పొంగుతున్న చోట్ల ప్రజలను దాటనివ్వకుండా చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు మున్సిపల్ అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. వైద్య సిబ్బంది నిత్యం సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకి రావొద్దని అధికారులు సూచిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.



అచ్చంపేట రూరల్ : మల్లంకుంట సమీపంలో వరదలో చిక్కుకున్న కారు



గద్వాల జిల్లా కేంద్రం సమీపంలో బురదలో వెళ్తున్న వాహనం

- ఏకధాటిగా కురిసిన వర్షం
- ఉధృతంగా పారుతున్న వాగులు
- కొట్టుకుపోయిన రోడ్లు, పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- ఇండ్లలోకి చేరిన వర్షపునీరు
- ఇంటిపైకప్పు కూలి ఒకరి మృతి
- అప్రమత్తంగా ఉండాలన్న కలెక్టర్లు, ఎస్పీలు
- 24 గంటలు పనిచేసేలా కంట్రోల్‌రూంల ఏర్పాటు

మహబూబ్‌నగర్, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి.. జిల్లాలో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో ఆయా జిల్లా కేంద్రాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో భారీ వర్షాలతో జన జీవనం స్తంభించింది.. ఉమ్మడి జిల్లాలోని పెద్దవాగులన్నీ ఉప్పొంగుతున్నాయి.. దుందుభీ నదితోపాటు సంగంబండ, ఊకచెట్టు, కందూరు వాగులు పొంగిపొర్లుతున్నాయి.. అటు ఎగువన కురుస్తున్న వర్షాలతోపాటు ఉమ్మడి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు కృష్ణా, భీమా నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. భీమా నదికి సుమారు రెండు లక్షల క్యూసెక్కుల వరద వచ్చి కృష్ణానదిలో కలుస్తోంది. జూరాల ప్రాజెక్టు 45 గేట్లు ఎత్తి మూడు లక్షల 50 వేల క్యూసెక్కుల వరదను దిగువకు వదులుతున్నారు. మరోవైపు సంగంబండ రిజర్వాయర్‌కు ఎగువ నుంచి వరద వస్తుండడంతో నాలుగు గేట్లు ఎత్తి సుమారు 2000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో అనేక చోట్ల భారీ వర్షాలకు కాల్వలు తెగిపోయి పంటలకు నష్టం వాటిల్లింది. ఊట్కూరు మండలంలో చెరువులు నిండడంతో వరి పంట నీటిలో కొట్టుకుపోయింది. ఇదే మండలంలో సోమేశ్వరబండ నుంచి మక్తల్‌కు వస్తుండగా మల్లేపల్లి వద్ద కారు వాగులో చిక్కుకున్నది. డోకూర్ నుంచి దేవరకద్రకు వచ్చే దారిలో రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా భారీవర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతోపాటు మత్తడి దుంకుతున్న చెరువులతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం బావాయిపల్లి వాగు నిండుగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొల్లాపూర్ సమీపంలో పెద్దవాగు పొంగడంతో ముక్కిడిగుండం–కొల్లాపూర్ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. కౌకుంట్ల–ఇస్రంపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మధ్య రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. జడ్చర్లలో కురిసిన భారీ వర్షానికి రహదారులు మొత్తం జలమయమయ్యాయి. పట్టణం సమీపంలోని వంద పడకల దవాఖాన జలదిగ్బంధంలో చిక్కుకున్నది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు సూచిస్తున్నారు.



జడ్చర్ల : కోడ్గల్ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న దుందుభీ నది

### ఉమ్మడి జిల్లాకు భారీ వర్ష సూచన..

రానున్న 72 గంటల్లో ఉమ్మడి జిల్లాలో అనేక ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టరేట్‌లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కురుస్తున్న భారీ వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనట్లు ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయా జిల్లా కలెక్టర్లు తెలిపారు. ఏ సమయంలోనైనా ప్రజలు ఫోన్ ద్వారా కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వవచ్చని సూచిస్తున్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆయా శాఖల అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని కలెక్టర్లు సూచించారు. ఉమ్మడి జిల్లాకు రెడ్‌అలర్ట్ ప్రకటించడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు, ఎస్పీలు ఆదేశించారు. ఈ కంట్రోల్ రూంలు 24/7 పని చేస్తాయని అధికారులు ప్రకటించారు.

### వర్షపాతం వివరాలు

జోగుళాంబ గద్వాల జిల్లాలో 33.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా.. అత్యధికంగా ఇటిక్యాల మండలంలో 53.2 మి.మీ., అత్యల్పంగా అయిజ మండలంలో 12.2 మి.మీ. నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం ఉదయం వరకు 52.3 మి.మీ., అత్యధికంగా అమ్రాబాద్ మండలంలో 74.8 మి.మీ., అత్యల్పంగా లింగాల మండలంలో 1.8 మి.మీ., శనివారం సాయంత్రం వరకు 55.44 మి.మీ. కురిసింది. మహబూబ్‌నగర్ జిల్లాలో 47.9 మి.మీ. నమోదు కాగా.. అత్యధికంగా కౌకుంట్ల మండలంలో 88.2 మి.మీ. అత్యల్పంగా బాలానగర్ మండలంలో 26.8 మి.మీ., నారాయణపేట జిల్లాలో 68.1 మి.మీ. వర్షపాతం నమోదు కాగా.. అత్యధికంగా మరికల్‌లో 138.06 మి.మీ., అత్యల్పంగా కృష్ణలో 20.6 మి.మీ. నమోదైంది. వనపర్తి జిల్లాలో 47.7 మి.మీ. నమోదు కాగా.. అత్యధికంగా రేవల్లిలో 77.6 మి.మీ., అత్యల్పం చిన్నంబావిలో 21.8 మి.మీ. నమోదైంది.

## ప్రమాదపు అంచున చీమలతిప్ప!

- కృష్ణానది మధ్యలో జాలర్లు

కొల్లాపూర్, ఆగస్టు 31 : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం అమరగిరి సమీపంలోని కృష్ణానది మధ్యలో ఉన్న చీమలతిప్ప ప్రమాదపు అంచున ఉన్నట్లు తెలుస్తోంది. భారీ అలలతో కృష్ణానది తీరం ఉగ్రరూపం దాల్చింది. దీంతో నదిలో వెళ్లేందుకు జాలర్లు సైతం భయపడుతున్నారు. అలాంటిది కృష్ణానది నడిమధ్యలో చీమలతిప్పపై స్థావరం ఏర్పాటు చేసుకొని ఉన్న జాలర్లకు ఈ వరద ఉధృతి రోజురోజుకూ గండంగా మారింది. 2009 సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారం నుంచి కురిసిన వర్షాల దాటికి అక్టోబర్‌లో వరదలు వచ్చాయి. ఆ సమయంలో కృష్ణానదితీరంలోని చాలా గ్రామాలు, పట్టణాలు ముంపునకు గురయ్యాయి. అదే సమయంలో చీమలతిప్పపై ఉన్న జాలర్లు చావు అంచులోకి వెళ్లారు. చీమలతిప్పకు బయటి ప్రపంచానికి సంబంధం ఉండకపోవడమే ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం కూడా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చీమలతిప్ప నుంచి బయటకు వచ్చే అవకాశం లేదు. అధికారులు ఈ వరద నుంచి చీమలతిప్ప జాలర్లను రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.









నాగర్‌కర్నూల్‌లో నిలిచిన నీటిలో వెళ్తున్న వాహనాలు, ధన్వాడ : పాతపల్లి వాగును ట్రాక్టర్ సాయంతో దాటుతున్న స్థానికులు, మరికల్ : ఇంట్లోకి వచ్చిన నీరు, జడ్చర్ల : తంగెళ్లపల్లి రోడ్డుపై రాకపోకలను నిలిపివేసిన దృశ్యం

### నా భార్య గర్భవతి అన్నా కనికరించలే..



అంధురాలైన నా భార్య నిండు గర్భిణీ అన్నా అధికారులు కనికరించలేదు.. నాకు రెండు కాళ్లు లేవు.. కాన్పు కోసం జిల్లా పెద్ద దవాఖానకు తీసుకెళ్లాం.. ఈ నెల 30న మధ్యాహ్నం 12:15 గంటలకు జిల్లా పెద్ద దవాఖానలో ఆపరేషన్ చేశారు. పండంటి మగబిడ్డకు జన్మినిచ్చింది. నాకు రెండు కాళ్లు లేకపోవడంతో ఇతరుల వద్ద పనిచేస్తూ ఇస్తరాకులు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునేవాడిని. ప్రస్తుతం ఉన్న ఇంటిని కూల్చడంతో సమీప బంధువుల ఇంట్లో తలదాచుకున్నా.. నా భార్య డిశ్చార్జి అయ్యాక ఏడ ఉండాలో తెలియడం లేదు. అధికారులు మాకు న్యాయం చేయాలి.

*- వెంకటేశ్, బాధితుడు*

### నిర్మాణ స్థలాలు వారివి కావు..



సర్వే నెంబర్ 523లో నిర్మాణాలు చేసిన స్థలాలు వారివి కావు. నివాసం ఉన్న ఇండ్లు మేం కూల్చలేదు.. పట్టా సర్టిఫికెట్లు ఉన్నాయి.. న్యాయం చేయాలని కోరుతున్నారు. సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటే పరిశీలించి ప్రభుత్వ పరిధిలో న్యాయం చేసేందుకు చర్యలు చేపడతాం. బోగస్ సర్టిఫికెట్లు ఇతరులు మాకు అమ్మారని అంటున్నారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి కారకులైన వారిపై చర్యలు చేపడతాం.

*- ఘాన్సీరాం, తాసీల్దార్, మహబూబ్‌నగర్ అర్బన్*

# నాన్చుతారా.. న్యాయం చేస్తారా?

- గూడులేక దివ్యాంగుల అరిగోస
- పునరావాసం ఉత్తమాటేనా..?
- ఒక్కపూట భోజనంతోనే సరి
- నీడ కరువై బంధువుల ఇండ్లల్లో తలదాచుకుంటున్న బాధితులు



ఆదర్శనగర్‌లో నేలమట్టమైన ఇల్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 31 : మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలోని క్రిస్టియన్‌పల్లి సర్వే నెంబర్ 523 లో ఈనెల 28న అర్ధరాత్రి సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా పేదల ఇండ్లు కూలగొట్టి నిరాశ్రయులను చేసిన విషయంలో దివ్యాంగులు, దళితులు, నిరుపేదలకు న్యాయం చేస్తారా? సమస్యకు పరిష్కారం చూపకుండా నాన్చుతారా? అనేది ఉమ్మడి పాలమూరుతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

***పట్టాలిచ్చింది.. కూలగొట్టింది కాంగ్రెస్ హయాంలోనే..***

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పట్టాలు ఇచ్చి అదే ప్రభుత్వం అక్కడ కట్టుకున్న ఇండ్లను కూలగొట్టడం తీవ్ర దుమారం రేపుతోంది. నోటీసులు లేకుండా ఇల్లు కూలగొట్టాలని చట్టంలో ఎక్కడా లేదు. కానీ అధికారులు ఎలాంటి నోటీసులు లేకుండా ఇండ్లను కూలగొట్టారని బాధితులు వాపోతున్నారు. డబ్బు, పరపతి ఉండే వారికి నోటీసులు ఇచ్చి సమయం ఇస్తున్న అధికారులు పేదల విషయంలో అలా ఎందుకు వ్యవహరించలేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇది కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యగా పలు సంఘాలు అభివర్ణిస్తున్నాయి. పట్టాలు నిజమైనవి కాకపోతే విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. అంతేకానీ రూపాయి రూపాయి కూడబెట్టుకొని కట్టుకున్న వారి ఇండ్లను కూలగొట్టడం సరికాదని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

***నిరాశ్రయులకు ఆశ్రయం..***

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సర్వే నెంబరు 523 బాధితుల పక్షాన ఉంటూ.. నిరాశ్రయులైన వారికి బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఈ నెల 29, 30 రెండు రోజుల పాటు భోజన వసతి కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు కూలగొట్టిన ప్రాంతంలోనే ఇండ్లు నిర్మాణం చేయడంతోపాటు నిర్మాణం పూర్తయ్యే వరకు తాత్కాలిక వసతి సౌకర్యం కల్పించాలని, పేద ప్రజలకు న్యాయం చేయాలంటూ కలెక్టర్ విజయేందిర బోయి, జిల్లా యంత్రాంగాన్ని కోరారు.

***రెండు రోజుల తర్వాత స్పందించిన ఎమ్మెల్యే***

రెండు రోజులుగా బాధితుల ఆందోళన, నిరసనల నేపథ్యంలో రెండు రోజుల అనంతరం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి నిరాశ్రయులకు పునరావాసం కల్పిస్తామని ఈ నెల 30 రాత్రి బాధితులకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల పథకాలలో మీకు ప్రాధాన్యం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నిరాశ్రయులకు అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా.. శుక్రవారం దుప్పట్లు అందించి ఒక పూట భోజనం పెట్టించారు. శనివారం పునరావాస కేంద్రంలో ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో సమాచారం తెలుసుకున్న దివ్యాంగులు, నిరుపేదలు ఈ కేంద్రానికి చేరుకోలేదు. తమకు తెలిసిన వారి ఇండ్లల్లో, సమీప బంధువుల ఇండ్లల్లో తలదాచుకున్నారు.

***బోగస్ లెక్కలు తేలుస్తారా..?***

కళ్లు కన్పించని, కాళ్లు లేని, చెవులు వినపడని, నడవలేని దీన దుస్థితిలో ఉన్న దివ్యాంగులు మాత్రమే సర్వే నెంబర్ 523 క్రిస్టియన్‌పల్లి ఆదర్శనగర్ ప్రాంతంలో ఇండ్లు నిర్మించుకున్నారని బ్లైండ్‌లేమ్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు అంటుండగా.. అధికారులు మాత్రం అక్కడ చాలా వరకు నకిలీ, బోగస్ పట్టాదారులు ఇండ్ల నిర్మాణాల పేరిట ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయాలని చూస్తున్నారని అంటున్నారు. ఇదిలా ఉండగా మరికొందరు మధ్యవర్తుల ద్వారా భూమి పట్టాలు కొనుగోలు చేసి తాము నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారుల మద్దతుతో కొందరు దళారులు, మధ్యవర్తులు కలిపి భూ మాఫీయగా ఏర్పడి ప్రభుత్వ భూమి క్రయవిక్రయాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి.



సంగంబండ ప్రాజెక్టు గేట్ల నుంచి దిగువకు పారుతున్న వరద

## ప్రాజెక్టులకు భారీగా వరద

గద్వాల/అయిజ/శ్రీశైలం/మక్తల్, ఆగస్టు 31 : జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద చేరుతున్నది. జూరాల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. దీంతో జూరాల ప్రాజెక్టుకు 3,36,000 క్యూసెక్కుల వరద చేరుతుండగా ప్రాజెక్టు వద్ద 45 గేట్లు ఎత్తి 3,28,554 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 1,78,574 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,76,618 క్యూసెక్కులు నమోదైంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1,87,209 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1,86,643 క్యూసెక్కులు నమోదైంది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 42,142 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 10,067 క్యూసెక్కులు నమోదైంది. ఆర్డీఎస్ ఆనకట్టకు 6,658 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 6,020 క్యూసెక్కులు ఉన్నది. శ్రీశైలం ప్రాజెక్టులోకి శనివారం సాయంత్రం నాటికి 4,10,581 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా అవుట్ ఫ్లో 3,80,499 క్యూసెక్కులు నమోదైంది. అదేవిధంగా మక్తల్ నియోజకవర్గంలోని సంగంబండ రిజర్వాయర్(చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) ఎగువ నుంచి 4వేల క్యూసెక్కుల వరద రావడంతో నాలుగు గేట్లు ఎత్తి రెండు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.